సమస్యల పరిష్కారమే ధ్యేయంగా..

- ఇక నుంచి డివిజన్ స్థాయిలో ప్రజావాణి
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డివిజన్ స్థాయిలో ఆర్డీవోల నేతృత్వంలో ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడే సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించారు. డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం ఇబ్రహీంపట్నం, కందుకూరు, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్ డివిజన్లలో ఆర్డీవోల నేతృత్వంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది. డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తే ఆ స్థాయిలో కూడా సమస్యలు పరిష్కారమవుతాయని భావించి నిర్ణయం తీసుకున్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించనున్న ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు హాజరై పరిష్కారమయ్యే వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా చూడాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా డివిజన్ స్థాయిలో వీటిని నిర్వహిస్తే బాగుంటుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశ్

యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలి

జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) చైర్మన్ వెంకటేశ్

ధారూరు, డిసెంబర్ 21 : యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలని, బాలలకు రక్షణ, సంరక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) చైర్మన్ వెంకటేశ్ అన్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని ధారూరు స్టేషన్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలందరూ రక్షణ, సంరక్షణ పొందేలా పాఠశాలలు, గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల గురించి పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు.

ధారూరు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాల లోపు బాలలను వేధింపులకు గురి చేస్తే పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలలకు ఎలాంటి సమస్యలున్నా డయల్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి ఫోన్ చేయాలన్నారు. ధారూరు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలలు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఏవైనా ఇబ్బందులుంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. పాఠశాలలో ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి సమస్యలు చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో బాల రక్ష భవన్ కో ఆర్డినేటర్ కాంతారావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జి డీసీపీవో శ్రీకాంత్, సోషల్ వర్కర్ వనమాల, చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రాజూజునాయక్, కేస్ వర్కర్ మహేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతాబాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, హబ్ ప్రతి నిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు
- హాజరైన సంక్షేమ గురుకుల రాష్ట్రాధికారి భీమయ్య

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 21 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సంక్షేమ గురుకుల రాష్ట్రాధికారి భీమయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్లు ఫ్లారెన్స్ రాణి, పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లతతో కలిసి పాల్గొన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని 7 జోన్ల నుంచి అండర్ 14, 17, 19 విభాగాల్లో 1190 మంది విద్యార్థినులు 9 క్రీడా పోటీల్లో పాల్గొనడం జరిగిందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో గురుకుల విద్యార్థినులను ప్రోత్సహిస్తున్న గురుకుల విద్యాలయాల కార్యదర్శి అలుగు వర్షిణిని అభినందించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మణి, అధ్యాపకులున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు, నిర్వాహకులు

దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ సందర్శన

సిబ్బందితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

దౌల్తాబాద్, డిసెంబర్ 21 : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి శనివారం సందర్శించారు. పోలీసులు ఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్ పట్ల కళాజాత బృందాలతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దౌల్తాబాద్ మండలంలో ప్రస్తుతానికి క్రైమ్ రేట్ తగ్గిందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దౌల్తాబాద్‌ఎస్ఐ రవిగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కలకొండ విద్యార్థులు ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో పీఈటీ శ్రీకాంత్

మాడ్గుల, డిసెంబర్ 21 : మండలంలోని కలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్ తెలిపారు. సీఎం కప్ పోటీలో భాగంగా శనివారం సరూర్‌నగర్‌లో జరిగిన కబడ్డీ జట్టుకు శ్వేత, వాలీబాల్ జట్టుకు గోరెంట్ల నందిని డిసెంబర్ 28, 29, 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

అంగన్‌వాడీ టీచర్‌కు మెమో జారీ

నవాబుపేట, డిసెంబర్ 21 : మండల పరిధిలోని గంగ్యాడ గ్రామానికి చెందిన ఓ చిన్నారి కులం వారు మృతిచెందగా ఆ చిన్నారి అంగన్‌వాడీ కేంద్రానికి రోజూ లాగే రావడంతో టీచర్ ఇంటికి పంపించింది. దీంతో చిన్నారి తండ్రి టీచర్ రాజేశ్వరిని వివరణ అడిగాడు. దీంతో స్పందించిన టీచర్ దగ్గరి బంధువుల మరణంతో మీ ఇంటివాళ్లందరికీ సుష్టి ఉంటుంది కదా చిన్నారి ఎలా పంపుతారని వాదించింది. ఇందుకు సంబంధించిన వీడియోను తండ్రి తన ఫోన్లో బంధించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. శనివారం వికారాబాద్ జిల్లా సీడీపీవో (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) వెంకటేశ్వరమ్మ సంబంధిత అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులను, ఘటనకు సంబంధించిన చిన్నారి తండ్రిని పిలిచి విచారణ చేయగా అంగన్‌వాడీ టీచర్ వ్యవహరించిన తీరు రుజువు కావడంతో అందరి సమక్షంలో మెమో జారీ చేసింది. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో టీచర్‌ను హెచ్చరిస్తున్న సీడీపీవో వెంకటేశ్వరమ్మ

కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

కర్రతో మోది మహిళ హత్య

- కేసును ఛేదించిన పోలీసులు
- రిమాండ్‌కు నిందితుడు

షాద్‌నగర్, డిసెంబర్ 21 : చెత్తను ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ మహిళను ఓ వ్యక్తి కర్రతో చితకబాది హత్యకు పాల్పడిన సంఘటన షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. హత్యకు పాల్పడిన వ్యక్తిని షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన పావని(40) తన కూతురుతో కలిసి షాద్‌నగర్ ప్రాంతలో ఉంటూ చెత్తను ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నది. కర్నూల్ జిల్లా ఆలూరు మండలం జోలాపూర్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్ షాద్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉంటూ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా పావని, వెంకటేశ్‌ల మధ్య పరిచయం ఏర్పడింది. ఈ నెల 15న రాత్రి వెంకటేశ్ షాద్‌నగర్‌లోని బుచ్చిగూడ రోడ్డు వంతెన వద్ద ఉన్న పావని వద్దకు వెళ్లి నిన్న ఎక్కడికి పోయావు? అని నిలదీశాడు. తన భర్త శ్రీనివాస్ వద్దకు వెళ్లానని పావని చెప్పడంతో ఒక్కసారిగా కోపం పెంచుకొని, తాను ఉండగా నీ భర్త వద్దకు ఎందుకు వెళ్లావని అక్కడే ఉన్న కర్రతో పావనిని చితకబాదాడు. అనంతరం తన వద్ద ఉన్న ఇనుప రాడ్డుతో తలపై మోదాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన పావని మృతిచెందింది. ఈ విషయాన్ని గమనించిన వెంకటేశ్ షాద్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి కర్నూల్‌కు పారిపోయాడు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపగా నిందితుడిని వెంకటేశ్‌గా గుర్తించి అరెస్ట్ చేశామని వివరించారు. కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసులను సీఐ అభినందించారు.

కొత్త సంవత్సర వేడుకలకు గోవా మద్యం

వాస్కోడిగామా రైల్లో పట్టుబడిన 95 మద్యం బాటిళ్లు

గోవా మద్యం పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

వికారాబాద్, డిసెంబర్ 21 : కొత్త సంవత్సరం వేడుకల కోసం కొందరు వ్యక్తులు గోవా నుంచి పెద్దమొత్తంలో మద్యం బాటిళ్లను తీసుకువెళుతున్నారనే సమాచారం మేరకు వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు వాస్కోడిగామా రైల్లో శనివారం తెల్లవారుజామున దాడులు నిర్వహించి 95 మద్యం బాటిళ్లను స్వాధీనంచేసుకున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాగవీణ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు యువకులు రానున్న కొత్త సంవత్సర వేడుకల కోసం మద్యం కొనుగోలుకు గోవా వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గోవాలో మద్యం కొనుగోలు చేసుకొని వాస్కోడిగామా రైల్లో హైదరాబాద్‌కు వస్తున్నారు. సమాచారం అందుకున్న రంగారెడ్డి డివిజన్‌లోని వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయభాస్కర్, డీటీఎఫ్, ఎక్సైజ్ ఎస్సైలు ప్రేమ్‌రెడ్డి, వీరాంజనేయులు సిబ్బంది రైల్లో తనిఖీలు చేపట్టారు. నాలుగు బోగీల్లో దాడులు నిర్వహించి రూ.లక్ష విలువ చేసే 95 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని పట్టుకున్న వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్ అభినందించారు.

ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో శనివారం పర్యాటకులు భారీగా తరలి వచ్చి సందడి చేశారు. ప్రాజెక్టులో బోటింగ్ చేసేందుకు బోటింగ్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. బోటింగ్‌తో పాటు ప్రాజెక్టు అందాలను పర్యాటకులు తిలకించారు. ప్రాజెక్టు నీటిలో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
– ధారూరు, డిసెంబర్ 21

పత్రీజీ ధ్యాన మహాయాగం మహాసభలు ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఎంపీలు మల్లు రవి, నాగరాజు, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 21 : కడ్తాల్ మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం ధ్యాన మహాసభలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. పదకొండు రోజులపాటు జరిగే ధ్యాన మహాయాగం సభలను పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పత్రీజీ కుమార్తె పరిణతి పత్రీతో కలిసి నాగర్‌కర్నూల్, కర్నూలు ఎంపీలు మల్లు రవి, నాగరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. శ్వాసపై ధ్యాస ఉంచడమే ధ్యానమని.. మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ.. నేటి యాంత్రిక జీవనంలో ప్రతిఒక్కరూ ధ్యాన సాధన చేయాల్సిన అవశ్యకత ఎంతో ఉన్నదని తెలిపారు. మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ ఆశయ సాధనకు ప్రతి ధ్యాని కృషి చేయాలని తెలిపారు. ధ్యాన మహాసభలకు వచ్చే ధ్యానుల కోసం నిర్వాహకులు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా కళాకారులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకుముందు సుభాష్‌పత్రీజీ శక్తిస్థల్‌ను ఎంపీలు, ట్రస్టు సభ్యులు, నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, ఏఎంసీ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ధ్యాన మహాసభల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

మహాసభలో పాల్గొన్న ధ్యానులు

టీఎస్ జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఘణాపూర్ జీహెచ్‌ఎం అశోక్ నియామకం

మర్పల్లి, మర్పల్లి 21: టీఎస్ జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఘణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం అశోక్‌ను శనివారం రాష్ట్ర శాఖ నియమించింది. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని జీహెచ్‌ఎంల సమస్యల పరిష్కరించేందుకు కృషిచేస్తానని, రాష్ట్ర, జిల్లా శాఖల మధ్య సమన్వయం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

డిస్ట్రిక్ 150 రెస్టారెంట్‌లో ఎగసిపడుతున్న మంటలు

నాలెడ్జ్ సిటీలో అగ్నిప్రమాదం

శేరిలింగంపల్లి, డిసెంబర్ 21: మాదాపూర్ నాలెడ్జ్ సిటీలోని ఐటీ కారిడార్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న, మాదాపూర్ ఫైర్ అధికారి ఫజల్ కథనం ప్రకారం... రాయదుర్గం సర్వే నం.83 నాలెడ్జ్ సిటీలోని సత్వకు చెందిన బహుళ అంతస్తుల భవనం ఐదో అంతస్తులో డిస్టిక్ 150 రెస్టారెంట్‌లో శనివారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న మాదాపూర్ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని దాదాపు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు. కాగా అప్పటికే రెస్టారెంట్ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. రెస్టారెంట్ అద్దాలు, గోడలు పగిలిపోయి, ఫర్నిచర్, మద్యం, విదేశీ మద్యం బాటిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. 4వ అంతస్తులో ఉన్న క్వారమ్ క్లబ్ అద్దాలు సైతం అగ్ని ప్రమాదంలో ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఆస్తినష్టం వివరాలు తెలియాల్సి ఉంది. భవనం ఆపరేషనల్ మేనేజర్ పియూష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గ్యాస్ పైపులైన్ లీకేజీ కారణమని, తద్వారా మంటలు వ్యాపించి చెలరేగినట్లు ఫైర్ అధికారులు తెలిపారు.

పరిగి పట్టణంతోపాటు శివారు ప్రాంతాలు, వివిధ గ్రామాలను శనివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8.30 గంటల వరకు సైతం కొన్ని ప్రాంతాల్లో పొగమంచు ఉండడంతో వాహనదారులు, ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత వారం రోజుల్లో రెండోసారి పొగమంచు కమ్ముకుంది. – పరిగి, డిసెంబర్ 21

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి..

అధిక వడ్డీలు కట్టలేక ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య

సాయి కిరణ్

బడంగ్‌పేట, డిసెంబర్ 21 : ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలైన ఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహేశ్వరం పోచమ్మ బస్తీకి చెందిన ఎదిరే లక్ష్మి, కొమరయ్య దంపతుల కుమారుడు సాయికిరణ్ (21) శుక్రవారం పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయి కిరణ్ నారాయణగూడలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు కాయకష్టం చేసి కొడుకును బాగా చదివించాలని కలలు కన్నారు. అతడు మాత్రం ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని ఉప్పుల ఊబిలో కూరుకుపోయాడు. దీంతో చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు అప్పుల విషయం చెప్పలేకపోయాడు. వారికి భారం కాకూడదని.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. గమనించిన స్థానికులు సాయి కిరణ్ తల్లికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె ఇంటికి వచ్చి చావు బతుకుల్లో ఉన్న కొడుకును 108లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోచమ్మ బస్తీలో సాయి కిరణ్ మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి. అతడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మహిళా సంఘాల్లో గోల్ మాల్..

- తప్పులు తడకగా రికార్డులు
- సభ్యులకు తెలియకుండా తీర్మానాలు.. రుణాలు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 21 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి తక్కువ వడ్డీలకు రుణాలు ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలోని కెనరా బ్యాంకులోని కొన్ని సంఘాల్లో పని చేస్తున్న వీఏవోలు, వీవోలు, కొంతమంది గ్రూపు లీడర్లు కలిసి సభ్యులకు తెలియకుండానే రుణాలు తీసుకొని.. వాటిని చెల్లించకుండానే మరో రుణం పొందుతున్నారు. అలాగే ప్రతి నెల సజావుగా చెల్లిస్తున్న వారికి రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామంలో ఓ మహిళా సంఘంలో పదిమంది సభ్యులున్నారు. పాత రుణం తిరిగి చెల్లించే క్రమంలో ఓ సభ్యురాలు రూ.2 లక్షలు తిరిగి చెల్లింకచపోయినా ఆమెకు తిరిగి రుణాలిచ్చారు. దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ చెల్లించలేదు. కానీ, సజావుగా రుణాలు చెల్లిస్తున్నవారు.. కొత్త రుణం ఇవ్వాలని కోరగా మీరు లక్ష రూపాయలు రుణం చెల్లిస్తేనే తిరిగి రుణం వస్తుందని 15 రోజులుగా బుకాయిస్తున్నారు. దీంతో ఓ సభ్యురాలికి అనుమానం వచ్చి బ్యాంకుకు చేరుకొని మేనేజర్ సమక్షంలో పూర్తి వివరాలు(బుక్‌లో) పరిశీలించింది. సంఘం రుణాలు పొందిన వివరాలు, తిరిగి చెల్లించిన వివరాలు, తీర్మానాలన్నీ తప్పుల తడకగా ఉన్నాయి. సభ్యురాలికి తెలియకుండానే ఆమె పేరుతో రుణం తీసుకొని ఇతరులకు ఇస్తున్నారు. దీంతో బ్యాంకు మేనేజర్ వారికి వార్నింగ్ ఇచ్చారు.

పూర్తి వివరాలు బుక్‌లో నమోదు చేయలేదు

నర్కూడ గ్రామంలోని ఓ మహిళా సంఘంలో సదరు వ్యక్తులు పుస్తకంలో పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయలేదు. రుణాలు తీసుకోవడం కోసం తీర్మానం చేసిన వాటి వివరాలు సభ్యులకు చెప్పలేదని తమ దృష్టికి వచ్చింది. బుక్‌లో వివరాలు పరిశీలించగా అన్ని తప్పులు ఉన్నాయి. ఇలా తప్పులు చేస్తున్న సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. – సాగర్ రెడ్డి, కెనరా బ్యాంకు మేనేజర్

దర్యాప్తు ఇంకెంతకాలం?

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : పోలీస్‌స్టేషన్‌లో కేసుల పెండెన్సీ పెరిగిపోతున్నది. తరచూ జరిగే క్రైమ్ రివ్యూలు తగ్గిపోయాయి.. పోలీస్‌స్టేషన్లలోని ఆయా విభాగాలకు సంబంధించిన బాధ్యతలకు సంబంధించిన 17 వర్టికల్స్‌ను మర్చిపోయారు.. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతున్నది.. వేగంగా పనులు ఎందుకు జరగడం లేదనే విషయంపై ఉన్నత స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే పరిస్థితులు కనిపించడం లేదు.. ఇలా ఈ ఏడాది ట్రై పోలీస్ కమిషనరేట్లలో కేసుల పెండెన్సీ పెరిగిపోయింది. వీటన్నింటికీ తోడు కొందరు పోలీసులు స్టేషన్‌లో కంటే బందోబస్తుల పేరుతో రోడ్లపైనే ఎక్కువగా ఉండాల్సిన పరిస్థితి ఉంటున్నది. కేసుల పెండెన్సీని తగ్గించేందుకు గత నెలలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను ఆయా ఠాణాలకు డీఐలుగా బాధ్యతలు అప్పగించడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. దీనికి ఎన్నో కారణాలున్నాయి... గత ఏడాది చివరలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత అప్పటి వరకు పని చేసిన ట్రై పోలీస్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఆ తరువాత ఎంపీ ఎన్నికల సందర్భంగా మరోసారి రాచకొండలో పోలీసు కమిషనర్ల బదిలీ, ఆ తరువాత మరోసారి బదిలీ కాగా.. అదే కోవలో హైదరాబాద్‌లో పోలీస్ కమిషనర్ మార్పు జరిగింది. ఆయా కమిషనర్లు వచ్చి పరిస్థితులు చక్కబెట్టుకునే వరకు ఉన్న సమయం కాస్త అయిపోవడం, ఉన్నతస్థాయిలో అధికారుల మార్పు చేర్పులతో కిందిస్థాయిలో పూర్తిగా పట్టు సడలిపోయిందనే వాదన వినిపించింది. వీటన్నింటికీ తోడు 17 వర్టికల్స్ పర్యవేక్షణ కూడా లేకపోవడంతో క్షేత్ర స్థాయిలోని అధికారులు ఆడిందే ఆటగా కొనసాగుతూ..వస్తున్నదని పోలీస్ శాఖలోనే చర్చ జరుగుతున్నది.

ఎప్పటికప్పుడు రివ్యూలతో..

రిసెప్షన్ స్టాఫ్, స్టేషన్ రైటర్, క్రైమ్ రైటర్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ స్టాఫ్, కోర్టు మానిటరింగ్ సిస్టం, వారెంట్ స్టాఫ్, సమన్స్, టెక్నాలజీ టీమ్, ఇన్వెస్టిగేషన్ స్టాఫ్, క్రైమ్ స్టాఫ్, మెడికల్ సర్టిఫికెట్ స్టాఫ్, స్టేషన్ ఇన్‌చార్జి, జనరల్ డ్యూటీ స్టాఫ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, అడ్మిన్ ఎస్సై ఇలా పోలీస్ స్టేషన్‌లోని ఆయా విభాగాలను 17గా విభజించి 17 వర్టికల్స్‌ను గత ప్రభుత్వ హయాంలో అందుబాటులోకి తెచ్చారు. ఆయా విభాగాల్లో పనిచేసే సిబ్బంది ప్రతిభను నెలవారీగా ఆరా తీస్తూ, తమ విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఉన్నతాధికారులు ప్రోత్సాహకాలు అందజేస్తూ కేసుల దర్యాప్తు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోవడం నుంచి కోర్టులో సాక్ష్యులను హాజరుపరిచే వరకు ఎవరి బాధ్యతలు వారు చూసుకునేవారు. దీంతో కేసుల దర్యాప్తు కూడా వేగంగా జరుగుతూ వచ్చింది. అయితే ఈ వ్యవస్థపై కొన్నాళ్లుగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అందరిని ఒకే గాటున అధికారులు చూస్తున్నారనే వాదన నడుస్తున్నది.